



# కరపత్రం

SINCE 2014

సోమవారం నవంబర్ 18 2024 | సంపుటి :0 | సంచిక : 40 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు: మంత్రి పొన్నం



హైదరాబాద్: తెలంగాణలో ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు ఏడాదికి సుమారు రూ.లక్ష మిగులుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రేపటి నుంచి కొత్త ఈవీ పాలసీ వస్తుందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈవీ పాలసీ వివరాలను మంత్రి వెల్లడించారు.

“జీవో 41 ద్వారా తీసుకువచ్చిన ఈవీ పాలసీ 2026 వరకు ఉంటుంది. టూ వీలర్స్, ఆటో, ట్రాన్స్‌పోర్టు బస్సులకు వందశాతం పన్ను మినహాయింపు. జంట నగరాల్లో ఈవీ బస్సులు తీసుకొస్తున్నాం. దిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో కాలుష్యం రాకుండా ఉండేందుకే ఈవీ పాలసీ తీసుకొచ్చాం. ప్రజలు విద్యుత్ వాహనాల కొనుగోలుపై దృష్టి పెట్టాలి” అని మంత్రి పొన్నం కోరారు.

## ‘కాళేశ్వరం’ లేకున్నా వరి దిగుబడి పెరిగింది: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో సంబంధం లేకుండా ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. దీంతో కాళేశ్వరం వల్లే వరి సాగు పెరిగిందన్న భారాస ప్రచారం పటాపంచలైందన్నారు. తెలంగాణ రైతు దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. అన్నదాత శ్రమ వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. అత్యధిక దిగుబడి ఘనత సాధించేందుకు కారణమైన ప్రతి రైతుకు రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

## తెలంగాణలో ఇద్దరు సీఎంలు: కేంద్రమంత్రి బండి సంజయ్



మిగతాది 2లో

- కేటీఆర్ నటనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు.

## భయానక పరిస్థితుల్లో మూసీ పరివాహక ప్రజలు



మిగతాది 2లో

- హైదరాబాద్: పేదలపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.
- మూసీ పరివాహక ప్రాంతంలో రాత్రి బస చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

## కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం

### : మంత్రులు సురేఖ, సీతక్క

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలంగాణ మంత్రులు కొండా సురేఖ , సీతక్క అన్నారు.



హనుమకొండ: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, సీతక్క అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా హనుమకొండలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నిర్వహించే ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. సభావేదికకు ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంగా పేరు పెట్టామన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరు ఆరింటిలో ఐదు గ్యారంటీలను అమలు చేశామని కొండా సురేఖ చెప్పారు. హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారన్నారు. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలిపారు. శతాబ్దాల తర్వాత కులగణన చేపడుతున్నామని.. ఇది సాధారణ విషయం కాదన్నారు. తెలంగాణ వేదికగా దీన్ని నిర్వహించడం చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. రైతుల విషయంలోనూ తమ ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధితో ముందుకెళ్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ఖజానాను దివాళా తీయించిన పరిస్థితుల్లో సీఎం రేవంత్ ధైర్యంగా ముందుకెళ్తున్నారన్నారు. సీతక్క మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ప్రగతి నివేదన సభ ఇది అని చెప్పారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా భవన్‌లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. భారాస ప్రభుత్వం పదేళ్లలో 21 లక్షల మందికే రుణమాఫీ చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 23 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా భారాస అడ్డుకుంటోందని ఆరోపించారు. భారాస, భాజపాకు రాజకీయాలు తప్ప ప్రజా సంక్షేమం పట్టదని ఆక్షేపించారు.

## కేటీఆర్‌ను కాపాడేందుకే..

### మూసీపై డ్రామా: మహేశ్‌కుమార్ గౌడ్

- భవిష్యత్ తరాల కోసమే మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



హైదరాబాద్: భవిష్యత్ తరాల కోసమే మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించాలని కోరారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది బుల్డోజర్ ప్రభుత్వం కాదని.. ఆ తరహా ప్రభుత్వం యూపీలో ఉందని అన్నారు. మోదీ ఆదేశిస్తే.. యోగి పాటిస్తారని వ్యాఖ్యానించారు. లగచర్ల ఘటనలో కేటీఆర్ తప్పు బహిర్గతమైందన్నారు. “ కేటీఆర్‌ను కాపాడడానికే మూసీపై భాజపా, భారాసలు డ్రామాలాడుతున్నాయి.

## ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడం వల్లే మహారాష్ట్రలో ఉద్యోగాలు లేవు: ప్రియాంక గాంధీ

- మహారాష్ట్రలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పాల్గొని ప్రసంగించారు.



2లో

## దిల్లీని కమ్మేసిన పొగమంచు.. వందకుపైగా విమానాలు ఆలస్యం..

- కాలుష్య కోరల్లో చిక్కుకున్న దిల్లీలో వాయు నాణ్యత అంతకంతకూ క్షీణిస్తోంది. దాంతో వందల సంఖ్యలో విమాన సర్వీసులపై ప్రభావం పడింది.



2లో

## తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభమైన గ్రూప్-3 పరీక్షలు



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా గ్రూప్–3 పరీక్షలు నేడు ప్రారంభమయ్యాయి. 1,365 గ్రూప్–3 సర్వీసుల పోస్టుల భర్తీకి రాతపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 ఉంటుంది. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–3 పరీక్ష నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ తెలిపింది. గ్రూప్–3 పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేముందు గుర్తింపు కార్డులను తనిఖీ చేసి పంపించారు. ఆలస్యంగా వచ్చిన పలువురిని అధికారులు అనుమతించలేదు.

# ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడం వల్లే మహారాష్ట్రలో ఉద్యోగాలు లేవు: ప్రియాంక గాంధీ

మొదటిపేజీ తరువాయి

ముంబయి: మహారాష్ట్రలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఫాక్స్‌కాన్, ఎయిర్‌బస్ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడం వల్లే మహారాష్ట్ర యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయని ఆరోపించారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, కొత్త విషయాలను నేర్చుకుంటున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉద్యోగావకాశాలు కల్పించట్లేదని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో మహాయుతి ప్రభుత్వం విఫలమయ్యిందని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో ఉన్న సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి మహాయుతి నాయకులు లడ్కీ బహిన్ వంటి పథకాలను తెరమీదకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ప్రజలు వారి మాయ మాటలను నమ్మకుండా అభివృద్ధి గురించి ఆలోచించాలని..మహిళలు డబ్బు కోసం కాకుండా మెరుగైన జీవితం కోసం ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి అధికారంలోకి వస్తే, సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ. 7,000 కనీస మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు.

ఐక్యంగా ఉంటే భద్రంగా ఉండొచ్చని భాజపా చేస్తున్న నినాదాలు పేద ప్రజల కోసం కాదని.. పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్న వారి మిత్రులు ఐక్యంగా ఉండాలని ఆయన సూచిస్తున్నారని అన్నారు. ఆ పార్టీ ఎవరి అభివృద్ధి గురించి కృషి చేస్తున్నారో దేశం మొత్తానికి తెలుసని పేర్కొన్నారు. పదేళ్ల మోదీ పాలనలో రైతులు, కార్మికులు కాదు వ్యాపారవేత్తల పరిశ్రమలు భద్రంగా ఉన్నాయని అన్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, దేశంలోని పలు ప్రధాన కంపెనీలు అదానీ ఆధీనంలో ఉన్నాయని, ప్రభుత్వ విధానాలు ఒక వ్యక్తికి అనుకూలంగా ఉండేలా మోదీ మార్పులు చేస్తున్నారని ప్రియాంక ఆరోపించారు. దేశానికి చెందిన ఆస్తులను ఒకరికి కేటాయించడానికి చూపించే నిబద్ధత యువతకు ఉద్యోగాలు కల్పించడంపై కూడా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్ హయాంలో రాజకీయ నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండేవారని..ప్రస్తుత ఎన్డీఏ పాలనలో ఈ జవాబుదారీతనం లేకుండా పోయిందని విమర్శించారు. ఎంవీఏ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగిస్తామని హామీ ఇచ్చారు. నవంబర్ 20న జరగనున్న ఎన్నికల్లో మహాయుతి కూటమికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

# కేటీఆర్‌ను కాపాడేందుకే..

## మూసీపై డ్రామా: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

ప్రజల్లో వ్యతిరేకత భారాస నేతలు సృష్టించిన కట్టుకథ. అద్భుతంగా పరిపాలన చేస్తున్న ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఎందుకు వస్తుంది? మూసీ పరివాహక ప్రాంతంలో ఒక్క రోజు నిద్రతో ఏం తెలుసుకున్నారో భాజపా నేతలు చెప్పాలి. ఎవరు అడ్డుపడినా మూసీ పునరుజ్జీవం ఆగదు. మూసీ పునరుజ్జీవంలో ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తాం. సబర్మతిపై లేని అభ్యంతరం మూసీపై ఎందుకు? మార్పుకోసమే ప్రజలు అధికారం ఇచ్చారు. ఆ మార్పును చూపించబోతున్నాం. తెలంగాణ అభివృద్ధి విషయంలో మరో మాట లేదు. మూసీ పునరుజ్జీవంలో నష్టపోయిన వారిని ఆదుకుంటాం.

భాజపా, భారాస రెండూ ఒకటే. ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారు. కేటీఆర్‌పై వస్తున్న ఆరోపణలను పక్కదారి పట్టించడానికే భాజపా మూసీ నిద్ర నాటకమాడింది. మూసీ పునరుజ్జీవానికి సలహాలు, సూచనలు ఇస్తే తీసుకుంటాం. భారాస మాదిరిగా మాది నియంతృత్వ ప్రభుత్వం కాదు. హైదరాబాద్‌ను ప్రపంచ మహా నగరాల సరసన చేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర విజన్ ఉంది" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# తెలంగాణలో ఇద్దరు సీఎంలు: కేంద్రమంత్రి బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

సంగారెడ్డి: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నటనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ అమాయకంగా నటిస్తున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్‌లో అరెస్టులు చేస్తామన్నారని చెప్పారు. భారాస నేతలు కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవగానే కాళేశ్వరం కుంభకోణం ఎటు పోయిందో అని ఎద్దేవా చేశారు.

"కేటీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందా? ధరణిలో భారాస నేతలను అరెస్టు చేస్తామన్నారు. దీపావళి ముందు బాంబులు పేలుతాయన్నారు.. సంక్రాంతి కూడా రాబోతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస కలిసి నాటకాలు చేస్తున్నాయి. తెలంగాణలో ఇద్దరు సీఎంలు ఉన్నారు.. ఒకరు రేవంత్‌రెడ్డి (%=వఝుత్ష్ర =వఽఽఎ%).. మరొకరు కేటీఆర్. ఫార్ములా–ఈ రేసింగ్‌లో కుంభకోణం జరిగినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. భాజపాను అడ్డుకోవడానికి భారాస, కాంగ్రెస్ డ్రామాలు చేస్తున్నాయి. భారాస విధ్వంసకర పార్టీ.. దాన్ని నిషేధించాలి. అలాంటి పార్టీ నేతలను నియంత్రించాల్సిన బాధ్యత సీఎందే. ఆయన అసమర్థత వల్లే భారాస నేతలు ఇలా వ్యవహరిస్తున్నారు" అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హైపర్‌సోనిక్ క్షిపణి పరీక్షను విజయవంతంగా చేపట్టిన భారత్



ఇంటర్నెట్‌డెస్క్: భారత్ తొలిసారి దీర్ఘశ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. ఈ పరీక్షతో భారత్ కూడా దీర్ఘశ్రేణి హైపర్ సోనిక్ క్షిపణులున్న దేశాల జాబితాలో చేరింది.

1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఇది ఛేదించగలదు. వివిధ రకాల వార్‌హెడ్‌లను అమర్చేలా దీనిని డిజైన్ చేశారు. "దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించడంతో భారత్ ఓ పెద్ద మైలురాయిని దాటింది. ఈ పరీక్ష ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఐలాండ్‌లో జరిగింది. ఈ చారిత్రక ఘట్టంతో అత్యాధునిక మిలిటరీ టెక్నాలజీని సాధించిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లైంది" అని ఎక్స్‌లో రక్షణ శాఖ పోస్టు చేసింది. పరీక్షకు సంబంధించిన వీడియోను కూడా జత చేసింది.

ఈ పరీక్ష సమయంలో క్షిపణి గమనాన్ని వివిధ వేదికల నుంచి జాగ్రత్తగా ట్రాక్ చేశారు. చివరి దశలో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఢీకొన్నట్లు డీఆర్‌డీవో వెల్లడించింది. హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ మిసైల్ కాంప్లెక్స్‌లో దీనిని రూపొందించారు. దేశంలోని ఇతర డీఆర్‌డీవో ల్యాబ్‌లు, పరిశ్రమలు సహకరించాయి. సైనిక దళాలకు చెందిన కీలక అధికారులు, శాస్త్రవేత్తల సమక్షంలో ఈ పరీక్ష జరిగింది.

ఈ టెక్నాలజీ ఎలా పనిచేస్తుంది..?

శబ్ద వేగానికి ఐదు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణి ప్రయాణించగలదు. అంటే సుమారు గంటకు 6,200 కిలోమీటర్లకు పైగా వేగం అన్నమాట. ఈ క్షిపణుల సాంకేతికతకు పదునుపెడితే.. గంటకు 24,140 కిమీ వేగాన్నీ అందుకోగలవు. అంత స్పీడ్‌లో కూడా శత్రు దేశాల రాడార్లు, గగనతల రక్షణ వ్యవస్థలకు దొరక్కుండా తన దిశను మార్చుకునే సామర్థ్యం దీని గ్లైడ్ వెహికల్‌కు ఉంది. దీనికి ఘన ఇంధన ఇంజిన్ అమర్చి ఉండటంతో దాదాపు 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రాకెట్ ఇంజిన్ విడిపోతుంది. దీనికి అమర్చిన గ్లైడ్ వెహికల్ లక్ష్యం దిశగా దూసుకుపోతుంది. అదే ఖండాంతర క్షిపణులు అయితే.. భూమి నుంచి చాలా ఎత్తుకు వెళ్లి బాలిస్టిక్ గమనంలో లక్ష్యంపై పడతాయి. వీటిని రాడార్లు ట్రాక్ చేయడం తేలిక. కానీ, హైపర్ సోనిక్ క్షిపణి పూర్తి భిన్నం. ఇది రాడార్ పరిధిలోకి వచ్చేసరికే.. శత్రువు స్పందించడానికి అతి స్వల్ప సమయం ఉంటుంది. దీంతో లక్ష్యాన్ని తేలిగ్గా ఛేదించేస్తుంది.

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ధ్వని వేగంతో పోటీపడే ఆయుధాల కోసం అమెరికా, సోవియట్ యూనియన్‌లు తీవ్రంగా ప్రయత్నించాయి. అదే సమయంలో ఐక్యరాజ్య సమితి బాహ్య అంతరిక్ష ఒప్పందంలోని లొసుగులను వాడుకొని దిగువ భూకక్ష్యను పాక్షికంగా ఉపయోగించుకొనే ఫోబ్స్ (ఫ్రాక్షనల్ ఆర్బిటల్ బంబార్డ్‌మెంట్ సిస్టమ్) ఆయుధాలను తయారు చేయడం మొదలుపెట్టాయి. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత అమెరికా ఆ ప్రాజెక్టుల నుంచి బయటకు వచ్చేసింది. రష్యా సైతం తగిన నిధులు లేకపోవడంతో వాటిని అటకెక్కించింది. 1972లో చేసుకొన్న క్షిపణి నిరోధక ఒప్పందం నుంచి 2002లో అమెరికా–రష్యాలు బయటకు వచ్చేశాయి.

అనంతరం క్షిపణి రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై అమెరికా దృష్టిపెట్టింది. రక్షణ వ్యవస్థలను ఛేదించి దాడిచేసే హైపర్‌సోనిక్ ఆయుధాలను రష్యా అభివృద్ధి చేసింది. వాటి నుంచి పుట్టుకొచ్చిందే 'అవన్‌గార్డ్' క్షిపణి. చైనా సైతం తొలిసారి 2017లో డీఎఫ్–17 మధ్యశ్రేణి క్షిపణిపై అమర్చిన హైపర్ సోనిక్ ఆయుధాన్ని పరీక్షించింది. చైనా లాంగ్ మార్చ్ రాకెట్‌తో ఫోబ్స్‌ను పోలిన ఆయుధాన్ని పరిశీలించింది. అమెరికా సైతం తాజాగా హైపర్ సోనిక్ పరిజ్ఞానాన్ని విజయవంతంగా పరీక్షించింది. మరోవైపు భారత్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఉత్తర కొరియాలు ఈ తరహా పరిజ్ఞానం కోసం ప్రయోగాలను ముమ్మరం చేశాయి. తాజాగా భారత్ విజయం సాధించింది.

# ఆమ్ ఆద్మీకి మంత్రి కైలాష్ గహ్లోత్ రాజీనామా

దిల్లీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కైలాష్ గహ్లోత్ ఆమ్‌ఆద్మీ పార్టీ కి రాజీనామా చేశారు.

దిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్‌ఆద్మీ పార్టీ కి భారీ షాక్..! దిల్లీ రవాణా శాఖ మంత్రి కైలాష్ గహ్లోత్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కేజ్రీవాల కు లేఖ పంపారు.

దిల్లీ ప్రభుత్వం అసంపూర్తి వాగ్దానాలు చేస్తోందని.. పార్టీ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని కైలాష్ గహ్లోత్ ఈ లేఖలో ఆరోపించారు. దిల్లీ ప్రజలకు సేవ చేయాలని నిబద్ధతతో ఏర్పడిన ఆప్ ఆశయాలను ఆ పార్టీ నేతల రాజకీయ ఆశయాలు అధిగమించాయని మండిపడ్డారు.

భాజపావి దిగజారుడు రాజకీయాలు.. ఆప్

దిల్లీ మంత్రి కైలాష్ గహ్లోత్ రాజీనామాపై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పందించారు. భాజపా దిగజారుడు రాజకీయాలతో కుట్రలను విజయవంతంగా అమలు చేస్తోందని మండిపడ్డారు. భాజపా ఒత్తిడి వల్లే తాజా పరిణామం చోటుచేసుకుందని.. గహ్లోత్‌ను సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలు టార్గెట్ చేశాయని ఆరోపించారు. ఐదేళ్ల పాటు ప్రభుత్వంలో ఉన్న గహ్లోత్ అలాంటి ఆరోపణలు చేయలేదన్నారు. భాజపా ఇచ్చిన స్క్రిప్ట ప్రకారమే ఆయన ఇప్పుడు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌ది మునిగిపోయే పడవ: భాజపా

మరోవైపు, కైలాష్ గహ్లోత్ రాజీనామాపై దిల్లీ భాజపా విభాగం 'ఎక్స్' వేదికగా స్పందించింది. ఆప్ మునిగిపోయే పడవ అని అర్థమవుతున్నందున.. కేజ్రీవాల్‌తో ఉన్న ప్రతి ఒక్కరూ బయటకు వచ్చేస్తున్నారని పేర్కొంది. భాజపా అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా మాట్లాడుతూ.. కైలాశ్ గహ్లోత్ మంత్రి పదవికి, ఆప్ సభ్యత్వానికి రాజీనామా చేశారన్నారు. ఆప్



ప్రస్తుతం 'ఖాస్ ఆద్మీ పార్టీ'గా మారిందని మండిపడ్డారు. దిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి.. ఆ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు.

ఆప్‌లో చేరిన భాజపా మాజీ ఎమ్మెల్యే..

మరోవైపు, మంత్రి కైలాశ్ రాజీనామా చేసిన కాసేపటికే భాజపా మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆప్‌లో చేరారు. ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సమక్షంలో ఆయన ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. కిరారీ అసెంబ్లీ సీటు నుంచి తంలో రెండు సార్లు భాజపా ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్‌పై ప్రశంసలు కురిపించారు. పూర్వంచల్ వర్గం కోసం పనిచేసిన ఏకైక వ్యక్తి కేజ్రీవాలేనన్నారు. దిల్లీలో ప్రజలకు అంతంతమాత్రంగానే ఉన్న మౌలికవసతులను మెరుగుపరిచారని.. గత పదేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కృషిచేశారని కొనియాడారు. అనంతరం మాజీ సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ.. అనిల్ ఝా పూర్వాంచల్ కమ్యూనిటీకి చెందిన పెద్ద నేతల్లో అనిల్ ఝా ఒకరని తెలిపారు. యూపీ, బిహార్ నుంచి విద్య, ఉపాధి కోసం ప్రజలు దిల్లీకి వస్తుంటారనీ.. కొన్నేళ్లుగా భాజపా, కాంగ్రెస్ ఈ వర్గం ప్రజల అవసరాలను గుర్తించలేదన్నారు. తాను సీఎం అయ్యాక వారి కాలనీలను అభివృద్ధి చేసి జీవన ప్రమాణాలను మెరుగుపరిచామని తెలిపారు.

# నా ప్రాణాలకు ముప్పు ఉంది: దిల్లీ కోర్టుకు వికాస్ యాదవ్ అభ్యర్థన

పన్నూ హత్యకు కుట్ర కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్ తన ప్రాణాలకు ముప్పు ఉందని దిల్లీ కోర్టులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ఇంటర్నెట్‌డెస్క్: సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర కేసులో భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్ పై అమెరికా అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందంటూ వికాస్ దిల్లీ కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి.తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ వికాస్ యాదవ్ దిల్లీ కోర్టుకు నివేదించినట్లు సమాచారం. తనపై పెట్టిన కేసు నిరాధారమైనదని, తనపై తప్పుడు అభియోగాలు మోపారని రెండు పేజీల అభ్యర్థనలో పేర్కొన్నారు. మరోవైపు ఆయన న్యాయబృందం సైతం వికాస్ భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేసింది. కేసు విచారణకు హాజరుకాకుండా మినహాయింపు ఇవ్వాలని కోర్టును కోరింది. ఈ అభ్యర్థనను ఆమోదించిన న్యాయస్థానం.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న జరిగే విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది.

అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అగ్రరాజ్యం గతేడాది ఆరోపించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.



ఇప్పటికే చెక్ రిపబ్లిక్ జైలులో ఉన్న నిఖిల్‌ను అమెరికాకు అప్పగించినట్లు ఆ మధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఈ కేసు వ్యవహారంపై అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు కూడా జారీ చేసింది.

అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్.. దీనిపై విచారణ జరిపేందుకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికాలోని విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది. ఈ అభియోగాల్లో పేర్కొన్న భారత అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని న్యూదిల్లీ తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ బృందం పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్‌పై అగ్రరాజ్యం అభియోగాలు మోపింది. గతేడాది డిసెంబరు 18న కిడ్నాప్, దోపిడి కేసులో వికాస్, అతడి అనుచరుడిని దిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. దీనిపై ఈ ఏడాది మార్చిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. ఆ మరుసటి నెలలోనే వికాస్‌కు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది.

# భయానక పరిస్థితుల్లో మూసీ పరివాహక ప్రజలు

మొదటిపేజీ తరువాయి

అక్కడి ప్రజలు భయానక పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. సుమారు 10 మంది గుండె పోటుతో మృతి చెందారని తెలిపారు. ప్రజాపాలన అంటే ఇళ్లు కూలగొట్టడమా అని ప్రశ్నించారు. మూసీలోకి మురికి నీరు రాకూడదంటే రూ.వేల కోట్లు కావాలన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీకి.. కృష్ణా, గోదావరి జలాలు ఎలా తెస్తారో చెప్పాలన్నారు. ఇళ్లు కూల్చకుండా దీన్ని అభివృద్ధి చేయాలని కిషన్‌రెడ్డి చెప్పారు.

సుందరీకరణ అంటే ఇళ్లు కూల్చడం కాదు: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మూసీ సుందరీకరణకు భాజపా వ్యతిరేకం కాదని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కానీ ఇందు కోసమని చెప్పి పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకోమన్నారు. ప్రజలు ఒప్పుకొంటే మూడింతల పరిహారం ఇచ్చి తీసుకోవాలన్నారు. మూసీ సుందరీకరణ అంటే ఇళ్లు కూల్చడం కాదు.. నీటిని శుద్ధి చేయడం అని ఎద్దేవా చేశారు.

# దిల్లీని కమ్మేసిన పొగమంచు.. వందకుపైగా విమానాలు ఆలస్యం..

మొదటిపేజీ తరువాయి



దిల్లీ: దేశ రాజధాని దిల్లీ లో వాయు నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోంది. వరుసగా ఐదో రోజు వాయునాణ్యత సూచీ 428 గా నమోదైంది. దీంతో విమాన సర్వీసులపై ప్రభావం పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో 800 మీటర్ల మేర దృశ్యాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో 107 విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయని.. 3 రద్దు అయ్యాయని ఫ్లైట్‌రాడార్ సంస్థ వెల్లడించింది. ఈ పరిస్థితులపై దిల్లీ ఎయిర్‌పోర్ట్, విమానయాన సంస్థలు ప్రయాణికులను అప్రమత్తం చేశాయి.

వాతావరణ శాఖ ప్రకారం, జాతీయ రాజధాని ప్రాంతాల్లోని అనేక మానిటరింగ్ స్టేషన్లలో వాయు నాణ్యతా సూచీ 400 పైనే నమోదైంది. బవానాలో అత్యధికంగా 471, అశోక్ విహార్, జహంగీర్‌పురిలో 466, ముండ్కా, వజీర్‌పుర్‌లో 463గా వాయు నాణ్యతా సూచీ నమోదయ్యింది.

దీంతో ఈ ప్రాంతాలు "సీవియర్ ప్లస్" వాయు నాణ్యతా కేటగిరీలోకి పడిపోయాయని అధికారులు పేర్కొన్నారు. దిల్లీలో కాలుష్య స్థాయిలు విపరీతంగా పెరుగుతుండటంతో.. ప్రజలు శ్వాసకోస, కంటి సమస్యల బారిన పడే అవకాశం ఉందని, ఇతర అనారోగ్య సమస్యలూ రావొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రత ఇలాగే పెరిగితే అత్యవసరం కాని నిర్మాణాలు, కూల్చివేతలపై నిషేధం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు దిల్లీలోని నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌లలో వరుసగా వాయు నాణ్యతా సూచీ 308, 307, 372, 260గా నమోదు అయ్యింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది వాయు నాణ్యతలో స్వల్ప మెరుగుదలను సూచిస్తోంది.

## పోలీస్ శాఖ సహాయ కేంద్రాలు




**కరపత్రం న్యూస్ కోరుట్ల: నవంబర్ 17**
కోరుట్ల పట్టణంలో బస్టాండ్ వద్ద, నంది చౌరస్తా లో గ్రూప్ 3 పోటీ పరీక్ష రాస్తున్నటువంటి అభ్యర్థుల సౌకర్యం కోసం కోరుట్ల పోలీస్ శాఖ వారు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు.పరీక్ష కేంద్రాలకు వెళ్లే దారి, పరీక్ష కేంద్రాల అడ్రెస్ లను తెలిపి సూచించిన సమయంలోఅభ్యర్థులు కేంద్రాలకు చేరుకునే విషయం లో సూచనల కేంద్రంగా ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని తెలిపారు.పోలీస్ శాఖ పట్టణంలోని కొన్ని పాఠశాలలకు చెందిన ఎన్ సీ సీ కాడేట్స్ ను ఈ హెల్ప్ డెస్క్ లో బాగస్వామ్యులను చేశారు. పోలీసు వారి సహాయ కేంద్రాలను పోటీ పరీక్షలకు వచ్చిన అభ్యర్థులు వినియోంచుకున్నారు. పోలీస్ వారికి సహాయకులు గా స్కౌట్ విద్యార్థులు ఉత్సహాంగా పని చేశారు.

## గృహలక్ష్మి హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక





**కరపత్రం న్యూస్ కోరుట్ల:: నవంబర్ 17:**
గృహలక్ష్మి హౌసింగ్ సొసైటీ నూతన డెవలప్మెంట్ కమిటీని ఆదివారం స్థానిక టీచర్స్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షునిగా కొలుగూరి శ్రీపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కల్వకోట చంద్ర ప్రకాష్, కోశాధికారిగా బెజ్జారపు వేణుగోపాల్, ఉపాధ్యక్షునిగా రుద్ర సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా బండారి గంగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా తునికి వేణుగోపాల్, జక్కని పరంధాం పెంట గణేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా దేవనపల్లి ఆనంద్, ముఖ్య సలహాదారులుగా దువ్వ సత్యనారాయణ, హనుమంతరావు లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కల్వకుంట్ల సుజిత్ రావు.



**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 17.**
మెట్ పల్లి పట్టణంకి చెందిన అడ్లగట్ట ప్రకాష్ కూతురి వివాహం ఎస్ ఆర్ ఎస్ పి కల్యాణ మండపం (రామాలయం) లో జరుగగా టిపిసిసి డెలిగే ట్ కల్వకుంట్ల సుజితు రావుహాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.వారితో పాటు మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా, టీపీసీసీ ఫిషర్మన్ ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందె మారుతీ,జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సింగరపు అశోక్,తోగిటి నాగరాజు,యండి జాఫర్,కల్లెడ గంగాధర్ తదితరులు ఉన్నారు.

## ఒడ్డె ఓబన్న విగ్రహం భూమి పూజ చేసిన మాజీ జడ్పీటీసీ



**కరపత్రం మల్లాపూర్ నవంబర్ 17**
స్వాతంత్ర సమరయోధుడు ఒడ్డిరాజుల కులదైవంగా భావించే ఒడ్డె ఓబన్న విగ్రహం ప్రతిష్ట కొరకు ఈ రోజు మల్లాపూర్ మండల కేంద్రం లోని ఒడ్డెరాకాలనీ లో మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూమి పూజ చేశారు అనంతరం ఒడ్డె ఓబన్న స్వాతంత్ర కాంక్ష ని ఆయన అనుసరించిన మార్గాలను అక్కడి ప్రజలతో కలిసి పంచుకున్నారు ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు సిరిపురం రవీందర్ ముద్దం సత్యనారాయణ గౌడ్ పెద్దిరెడ్డి లక్ష్మణ్ మరియు ఒడ్డెర కుల పెద్దలు శంకర్ శ్రీనివాస్ శివాజీ లు కాలనీ వాసులు పాల్గొన్నారు

# మేడ్చల్ లో గ్రూప్ 3 పరీక్షలు

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్

నిన్న ఆదివారం 17 నవంబర్ రోజున తెలంగాణ వ్యాప్తంగా గ్రూప్ 3 ఉద్యోగ పరీక్షలు జరిగాయి.తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ వివిధ ప్రభుత్వ శాఖల్లోని 1388 ఉద్యోగాల కొరకు 536477 మంది దరఖాస్తు చేసుకున్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. దాదాపు 65,361 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.అకౌంటెంట్, ఆడిటర్, సీనియర్ అకౌంటెంట్, సీనియర్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంటెంట్, అసిస్టెంట్ ఆడిటర్,స్టేషన్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, స్టోర్ కీపర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ మొదలైన ఉద్యోగాల భర్తీ కొరకు నిర్వహించిన పరీక్షలో మొత్తం 3 పేపర్లు ఉన్నాయి. ఒక్కో పేపరుకు 150 మార్కుల చొప్పున 450 మార్కులకు పరీక్షలు నిర్వహించారు. ఒక్కో పేపరు రాసేందుకు




రెండున్నర గంటల సమయం ఇచ్చారు.మేడ్చల్ లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ లో నిర్వహించిన పరీక్షల కొరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల ఉద్యోగులు,పోలీసులు విధులు నిర్వహించారు.మండల తహసీల్దార్ శ్రీమతి శైలజ గారు ఈ పరీక్షల పర్యవేక్షణ చేసారు.స్థానిక పోలీసులు తగిన బందోబస్తు కల్పించారు.చాలా కాలం నుండి ఎదురు చూస్తున్న ఉద్యోగ అభ్యర్థులు ఎందరో ఆశతో ఎదురుచూసిన పరీక్షలు ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు.

## గూగుల్ పే , ఫోన్ పే, పేటీఎంఎక్కువగా వాడుతున్నారా.?

# ఇన్ కం టాక్స్ జాగ్రత్త.




**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 17.**
సంవత్సరం కి 10లక్షలు యూపీఏ ద్వారా లిమిట్ దాటితే నోటీసులు తప్పనిసరి అని టాక్స్ నిపుణులు తెలుపుతున్నారు.డిజిటల్ పేమెంట్స్‌లో అత్యధికం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని అంటున్నారు.గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ఇలా రకరకాల యాప్స్‌ను ఉపయోగిస్తున్నారు.అయితే అంతా బాగానే ఉంది కానీ.. యూపీఐ యాప్స్‌ను ఎక్కువగా ఉపయోగించం వల్ల చిక్కుల్లో పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ఎక్కువ మొత్తంలో యూపీఐ లావాదేవీలు చేసే వారిపై ఆదాయపు పన్ను విభాగం నిఘా పెడుతోంది.బ్యాంక్ అకౌంట్‌లో పరిమితికి మించి నగదు జమ కావడం, ఎక్కువ మొత్తంలో విత్‌డ్రా చేసుకున్న ఆదాయపు పన్ను దేశ అధికారులు నిఘా పెడుతున్నారు. ఇలాంటి వారికి ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు పంపించే అవకాశం ఉందని ఇన్కంటాక్స్ ఏజెంట్ లు అంటున్నారు.దీంతో పన్నులు, పెనాల్టీలు చెల్లించాలని అధికారులు నేరుగా ఇంటికి నోటీసులు పంపించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.సాధారణంగా సేవింగ్స్ అకౌంట్‌లో ఒక ఏడాది రూ. 10 లక్షల లిమిట్ ఉంటుంది. ఈ లిమిట్ దాటితే వెంటనే వివరాలు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగానికి వెళ్తాయి. ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 285 బీఏ కింద బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పరిమితి ఉంటుంది. అలాగే ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్లు ఫైల్ చేసే సమయంలో సేవింగ్స్ ఖాతాలో జమ అయిన డబ్బుల వివరాలు సరిపోలకపోతే మీకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేస్తుంది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు



**కరపత్రం మల్లాపూర్ నవంబర్ 17**
మల్లాపూర్ మండలం కి సంబందించిన 2,36,500.విలువ గల చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు ఈ రోజు టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు అయన నివాసం లో అందించారు ఈ కార్యక్రమం లో సుజిత్ రావు వెంట మెట్టుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మెట్టుపల్లి మాజీ మండలకాంగ్రెస్ అధ్యక్షులు కూతుబుద్దీన్ పాషా రాష్ట్ర ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ యన్ యూ ఎస్ ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భారత్ రాజ్ కార్యకర్తలు మొగిలి రాజేందర్ అమ్ముల పవన్ పాల్గొన్నారు

## నూతన తోటి కుల సంఘ అధ్యక్షులుగా ఎన్నిక



**కరపత్రం ఎండపల్లి, నవంబర్ 17**
మండలంలోని రాజారాం పల్లి గ్రామంలో తోటి కుల సంక్షేమ సంఘం గ్రామ పటేల్ కుర్సంగి దామోదర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సమావేశంలో సభ్యులు అందరి సమక్షంలో నూతన పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించారు, అధ్యక్షులుగా కర్సంగి విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా కుర్సంగి రాజ్ కుమార్,ఉపాధ్యక్షులుగా అత్రం చక్రపాణి,కోశాధికారిగా ఆత్రం కార్తీక్,ప్రచార కార్యదర్శిగా ఆత్రం స్వరాజ్ ,ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి కుల సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతానని తెలిపారు,ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

## సుజిత్ రావు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.



**కరపత్రం మెట్ పల్లి, నవంబర్ 17.**
జగిత్యాల జిల్లా మెట్పల్లిలోని సుజిత్ రావు నివాసంలో ఆరుగురికి లబ్ధిదారుల రూపాయలు 2, 36,500 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను టిపిసిసి డెలిగే ట్ కల్వకుంట్ల సుజిత్ రావుఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుతుబ్ పా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుతు నారాయణ, నియోజకవర్గ ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం భరత్, మొగిలి రాజేందర్, అమ్ముల ప్రవీణ్ ఎండి మాజీద్, సమీర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన చంద్రమౌళి




**కరపత్రం వనపర్తి ప్రతినిధి:**
వనపర్తి పట్టణంలోని ఆరవ వార్డు మెట్టుపల్లి తండాకు చెందిన సీన్యా నాయక్ వృద్ధాప్యంతో శనివారం మరణించాడు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు నందిమల్ల చంద్రమౌళి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలపగా ఆయన ఆదేశాలతో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 5000 ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆటో రవీంద్ర నాయక్, సంజీవ్ నాయక్, డాక్య నాయక్, పూల్యా నాయక్, పీతాంబర్ నాయక్, నందిమల్ల నిఖిల్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.




# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న రిషబ్ శెట్టి కాంతార చాప్టర్ 1

కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి హీరోగా నటించిన కాంతార సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. దీంతో కాంతార చాప్టర్ 1 పై ఆసక్తి నెలకొంది. ఈసినిమాని హొంబలే ఫిల్మ్స్ నిర్మిస్తుండగా రిషబ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.20 కోట్లు బడ్జెట్ తో తెరకెక్కించగా దాదాపుగా 400 కోట్లు (గ్రాస్) కలెక్ట్ చేసింది. ఆమధ్య చిత్ర యూనిట్ కాంతార చాప్టర్ 1 ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చెయ్యగా మంచి రెస్పాన్స్ వచ్చింది.అయితే ఆదివారం కాంతార చాప్టర్ 1 చిత్రాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 2న వరల్డ్ వైడ్ గా ప్యాన్ ఇండియా భాషలలో రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ విషయానికి సంబందించిన పోస్టర్ ని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పోస్టర్ లో రిషబ్ శెట్టి వరాహ అవతారంలో త్రిశూలం పట్టుకుని కనిపించాడు. దీంతో రిషబ్ శెట్టి ఫ్యాన్స్ అనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయం ఇలా ఉండగా కాంతార సినిమా పెద్ద హిట్ అవ్వడంతో కాంతార చాప్టర్ 1 పై దృష్టి సారించాడు. ఈ క్రమంలో హాలీవుడ్, బాలీవుడ్ నుంచి టెక్నీషియన్స్ ని తీసుకొచ్చి పని చేస్తున్నాడు. దీంతో కాంతర లో విజువల్స్, గ్రాఫిక్స్ ఇవన్నీ కూడా వేరే లెవల్ లో ఉనబోతున్నట్లు సమాచారం.

# వచ్చే వారం బరిలోకి



కథానాయకుడు రామ్‌చరణ్ కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 16వ సినిమాని బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమైంది. దీని తొలి షెడ్యూల్ వచ్చే వారం నుంచి మైసూర్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకు తగ్గట్లుగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిసింది.ఓ ఆటను కేంద్రంగా చేసుకుని బలమైన భావోద్వేగాలు నిండిన కథాంశంతో ఈ చిత్రాన్ని ముస్తాబు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం చరణ్ తన లుక్‌ను కూడా మార్చుకుంటున్నారు. ఇందులో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించనున్నారు.

# నాన్నా.. మీరో ఫైటర్.. ఎన్నో త్యాగాలు చేశారు



శనివారం కన్నుమూసిన నారా రామ్మూర్తి నాయుడు గురించి ఆయన తనయుడు, సినీనటుడు నారా రోహిత్ ఎక్స్‌లో భావోద్వేగ పోస్టు పెట్టారు. 'మీరొక ఫైటర్ నాన్నా.. మా కోసం ఎన్నో త్యాగాలు చేశారు' అని పేర్కొన్నారు. "నాన్నా.. నాకు ప్రేమించడం, జీవితాన్ని గెలవడం నేర్పించారు. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండటానికి మీరే కారణం. ప్రజలను ప్రేమించడంతో పాటు.. మంచి కోసం పోరాడాలని చెప్పారు. మీ జీవితంలో ఎన్నో కష్టాలున్నా అవి మా దరి చేరకుండా పెంచారు. నాన్నా.. మీతో జీవితాంతం మరచిపోలేని ఎన్నో జ్ఞాపకాలు మాకున్నాయి. నాకు ఏం చెప్పాలో తోచడం లేదు.. బై నాన్నా" అని నారా రోహిత్ పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు కు నారా రామ్మూర్తి నాయుడు సోదరుడు. అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని ఆదివారం ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తరలించారు. స్వస్థలం నారావారిపల్లెలో మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# నా కోసమే ప్రత్యేకంగా రాయిస్తారట!

తన కెరీర్ కేవలం తెలుగు, హిందీ, తమిళ చిత్రాలకు మాత్రమే పరిమితం కాదు.. అంతకు మించి ఉంటుందని ఆశిస్తున్నా అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. ఎంచుకున్న పాత్రలతోనే గుర్తుండిపోయే కథానాయికల్లో మృణాల్ పేరు ముందు వరుసలో ఉంటుందనడంలో సందేహమే లేదు. వరుస చిత్రాలతో జోరు ప్రదర్శిస్తున్న ఈ భామ.. ప్రస్తుతం చిత్రనిర్మాతలు తన కోసమే ప్రత్యేకంగా కథలు సిద్ధం చేస్తున్నట్లు, ఈ విషయంలో ఆమె సంతృప్తిగా ఉందని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తన కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని బయటపెట్టింది. "ఈ మధ్య కాలంలో నేను చాలా స్క్రిప్ట్‌లు వింటున్నాను.కానీ 'సీతారామం', 'హాయ్ నాన్నా' లాంటి కథలు నన్ను అభిమానుల్లో ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఈ సినిమాలు నా బాధ్యతను మరింత పెంచాయి. నన్ను వాళ్ల ఇంట్లో అమ్మాయిగా స్వీకరించిన తెలుగు ప్రేక్షకులను ఎప్పటికీ నిరాశపరచాలనుకోవట్లేదు. ప్రస్తుతం నా కెరీర్‌లో నేను ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నాను. ఎంతో మంది చిత్రనిర్మాతలు నా దగ్గరికి వచ్చి 'మీతో సినిమా చేయాలనుంది. కానీ మీరు 'సీతారామం' లాంటి చిత్రాలతో ఓ బెంచ్‌మార్క్‌ను సెట్‌చేశారు. దానికి తగ్గట్టే కొంచెం ఆలస్యం అయినా మీ కోసం ప్రత్యేకంగా మంచి పాత్రను రాసి మీ ముందుకు వస్తామ'ని అంటున్నారు. ఈ విషయంలో నాకు కొంత తృప్తిగా ఉంది. నేను ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉంద"ని చెప్పుకొచ్చింది.

